ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శుక్రవారం 7 జూన్ 2024



కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌లో బాధితులు అన్నె కవిత దంపతులు

అర్ధరాత్రి దోపిడీ దొంగల బీభత్సం

- నష్కల్ వద్ద నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీ
- నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు
- రాళ్లతో ప్రయాణికుల దాడి.. ప్రతిదాడులు చేసిన దుండగులు
- బాధితురాలిది విజయవాడ.. కాజీపేట రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు

వివరాలు 6లో..

గిట్లైట్లయ్యే?

- చరిత్రను పునరావృతం చేయాలనుకున్న కమలనాథుల ఆశలపై నీళ్లు
- లోక్‌సభ ఎన్నికలో ఓటమిపై కేడర్ అంతర్మథనం
- బలమైన నాయకత్వం లేక పోల్‌మేనేజ్‌మెంట్‌లో వెనుకబాటు
- 'అసెంబ్లీ'లో కాంగ్రెస్‌కు ఓట్లేసినట్లే తమకూ వేస్తారనే అతివిశ్వాసం
- ప్రచారంలో వరంగల్‌పై దృష్టిపెట్టని రాష్ట్ర స్థాయి నేతలు
- ఓడినా భారీగా ఓట్లు పొందామంటూ సర్దిచెప్పుకుంటున్న నాయకులు



గెలుపు ధీమాలో ఉన్న బీజేపీకి ఓరుగల్లు ఓటర్ల ఝలక్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కమలనాథుల ఆశలపై ఓరుగల్లు ఓటర్లు నీళ్లు చల్లారు. 1984 నాటి చరిత్రను పునరావృతం చేస్తామన్న ధీమాలో ఉన్న బీజేపీ నేతలకు ఝలక్ ఇచ్చారు. మోదీ చరిష్మాతో వరంగల్ ఎంపీ స్థానంలో పాగా వేయాలనే పక్కా వ్యూహంతో బరిలో దిగినా 'గిట్లైట్లయ్యే..' అంటూ బీజేపీ నేతలు చర్చించుకుంటున్నారు. అయితే వ్యూహప్రతివ్యూహాలు ఎలా ఉన్నా సవాళ్లను అధిగమించటంలో బీజేపీ విఫలమైందన్న చర్చ జరుగుతుండగా.. ప్రచారం విషయంలో రాష్ట్ర నాయకత్వం వరంగల్‌పై అంతగా దృష్టిపెట్టలేదని, అసెంబ్లీ నియోజకవర్గాల్లో బలమైన నాయకత్వం లేక ప్రత్యర్థులకు దీటుగా పోల్‌మేనేజ్‌మెంట్ చేయలేకపోయారని, శ్రేణులు కూడా చేతులెత్తేశారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా 40ఏళ్ల నాడు వరంగల్‌లో బీజేపీ జెండా ఎగరిందని, మళ్లీ ఇప్పుడు ఎగరవేయబోతున్నామని ప్రచారంలో చెప్పుకొచ్చిన బీజేపీ నేతలకు ఓటర్లు ఇచ్చిన తీర్పు మింగుడుపడటంత లేదు. ఎక్కడెక్కడ తమకు ఓటు బ్యాంకు పెరిగింది.. ఎక్కడెక్కడ తాము నష్టపోయామని ఆ పార్టీ నేతలు లెక్కలు వేసుకుంటూ ఓటమికి గల కారణాలను విశ్లేషించుకుంటున్నారు.

చరిత్ర తిరగరాయడంలో భంగపాటు..

వరంగల్‌లో బీజేపీకి ఓ చరిత్ర ఉంది. 1984 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ దేశవ్యాప్తంగా రెండే ఎంపీ స్థానాల్లో విజయం సాధించగా.. అందులో ఒకటి వరంగల్. వరంగల్ (పాత హనుమకొండ) లోక్‌సభ స్థానం నుంచి నాడు చందుపట్ల జంగారెడ్డి ఎంపీగా విజయం సాధించారు. 1989లో మరోసారి జంగారెడ్డి పోటీ చేసినా విజయం సాధించలేదు. అప్పటి నుంచి బీజేపీ వరంగల్ స్థానంలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. 2009లో ఎస్సీ రిజర్వుడు స్థానంగా మారిన తరువాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేదు. అయితే కేంద్రంలోని నరేంద్రమోదీ చరిష్మాతో తెలంగాణలో బీజేపీకి ఓ ఊపు వచ్చింది. దీంతో ఈ ఊపులో వరంగల్‌లో కూడా గెలిచి 1984 చరిత్రను పునరావృతం చేయాలని భావించిన బీజేపీ.. బలమైన నేత కోసం వెతికింది. ఈ క్రమంలోనే వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, వరంగల్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న అరూరి రమేష్‌ను పార్టీలో చేర్చుకుని బరిలో దించింది. దీంతో బీజేపీకి క్రేజ్ పెరిగింది. యువత, మహిళలు, రైతులతో పాటు పట్టణ ఓటర్లు ఈసారి తాము మోదీకే ఓటేస్తామంటూ బహిరంగంగానే చెప్పే స్థాయికి బీజేపీ చేరింది. దీంతో వరంగల్‌లో బీజేపీ గెలుస్తుందనే చర్చ జరిగింది. కానీ అనూహ్యంగా కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలవడం.. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ఓటమిపాలై రెండో స్థానంలో నిలవడం చర్చనీయాంశంగా మారింది. చరిత్రను తిరగరాస్తామన్న ధీమా వ్యక్తం చేసిన కేడర్‌ను ఈ ఓటమి కుంగతీసింది.

పోల్‌మేనేజ్‌మెంట్‌లో ఫెయిల్..

వరంగల్ ఎంపీ స్థానంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. పోలింగ్ బూత్‌ల నుంచి కేడర్‌కు, సమావేశాలకు కావాల్సిన ఫండింగ్ కూడా పార్టీ నుంచే అందినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఎన్నికల్లో అత్యంత కీలకమైన పోల్‌మేనేజ్‌మెంట్‌లో మాత్రం పార్టీ చేతులెత్తేసిందనే చర్చ నడుస్తోంది. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీ చేసిన అనుభవం ఉన్న బీజేపీ అభ్యర్థికి పోల్‌మేనేజ్‌మెంట్‌పై పూర్తి అవగాహన ఉంది. అయితే ఎన్నికల ప్రచారం ముగిసిన వెంటనే కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ ఓటర్లకు కూడా నజరానాలను చేరవేశారని, ఇందుకోసం భారీగానే ఖర్చు చేశారన్న ప్రచారం జరుగుతోంది. కానీ పోల్‌మేనేజ్‌మెంట్ విషయంలో మాత్రం బీజేపీ మీనమేషాలు లెక్కించిందని, ప్రత్యర్థి పార్టీలకు దీటుగా ఓటర్లకు బీజేపీ నుంచి నజరానాలు అందలేదనే చర్చ జరుగుతోంది. ప్రత్యర్థులు పంపిణీ చేసిన దాంట్లో 50శాతమే ఇచ్చినప్పటికీ అవి కూడా 30శాతం ఓటర్లకే చేరాయని, బలమైన అభ్యర్థిగా పేరుండటంతో ఓటర్లు కూడా అదే స్థాయిలో నజరానాలు ఆశించినట్లుగా ప్రచారం జరిగింది. కానీ ఇందులో కమలనాథులు చేతులెత్తేయటంతో కేడర్‌తో పాటు ఓటర్లు అసంతృప్తికి గురైనట్లు చర్చ జరుగుతోంది. దీంతో అప్పటి వరకు బీజేపీకే ఓటేయాలని నిర్ణయించుకున్న ఓటర్లు కూడా చాలా వరకు మనస్సు మార్చుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ వైపు చూశారని తెలుస్తోంది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఇళ్ల నుంచి బయటకు రాకున్నా గెలిచారని, అదే తరహాలో తమకు మోదీ చరిష్మా కలిసొస్తుందని, నజరానాలతో పని లేకుండా ఓటర్లు తమను ఆశీర్వదిస్తారన్న అతి విశ్వాసం కూడా బీజేపీ ఓటమికి ఓ కారణంగా చెబుతున్నారు.

దృష్టి పెట్టని పెద్ద లీడర్లు..

బీజేపీ ఓటమికి మరో ప్రధాన కారణం నాయకత్వ లేమిగా చెప్పుకొంటున్నారు. బీజేపీపై ప్రజల్లో సానుభూతి వచ్చినప్పటికీ, దానిని ఓటు రూపంలో మార్చుకోవడంలో బీజేపీ విఫలమైందని, అన్ని చోట్ల నాయకత్వం లేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గంలో బీజేపీకి 2,182 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. కానీ పార్లమెంట్‌కు వచ్చే సరికి మోదీ చరిష్మా కారణంగా ఇక్కడ యువత బీజేపీ వైపు మొగ్గు చూపారని, అనూహ్యంగా బీజేపీకి 28,452ఓట్లు పోలయ్యాయని లెక్కలు చెబుతున్నాయి. అదే ఇక్కడ బలమైన నాయకత్వం ఉండి ఉంటే ఇంకా భారీగా ఓట్లు పడే అవకాశం ఉండేదనే చర్చ జరుగుతోంది. అలాగే స్టేషన్‌ఘనపూర్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 4,984 ఓట్లు మాత్రమే రాగా.. లోక్‌సభ ఎన్నికలో 40,332 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ కూడా పాలకుర్తి పరిస్థితే ఉందని, ఈ రెండు నియోజకవర్గాల్లో బలమైన నాయకత్వం లేకపోవటంతోనే బీజేపీ మూడో స్థానానికి పరిమితమైందన్న చర్చ జరుగుతోంది. ఇక బలమైన నాయకత్వం ఉండటం కారణంగా వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో బీజేపీకి భారీగా ఓట్లు పోలయ్యాయని, ఫలితంగా భూపాలపల్లి, పరకాల, వర్ధన్నపేటలో పార్టీ రెండోస్థానంలో నిలిచిందని, కానీ పార్టీలో నేతల మధ్య ఆధిపత్య పోరుతో నష్టం జరిగిందనే చర్చ జరుగుతోంది. దీనికి తోడు ఓ వైపు రాష్ట్ర నాయకత్వం పంపించిన ఇన్‌చార్జ్‌ల పెత్తనంతో చాలా మంది కీలక నేతలు అంటీముట్టనట్టు వ్యవహరించారనే ప్రచారం జరుగుతుండగా.. మరోవైపు వరంగల్ సీటుపై బీజేపీ దృష్టిపెట్టినా ప్రచారానికి కీలక నేతలు దూరంగా ఉండటం కూడా బీజేపీకి నష్టం చేకూర్చిందనే చర్చ జరుగుతోంది. వరంగల్‌లో మోదీ సభ సక్సెస్ కావడం శ్రేణుల్లో ఉత్సాహం నింపిందని, ఆ సభ ప్రభావం పట్టణ ప్రాంతాల్లోనే చూపిందని, అందుకే పట్టణప్రాంతాల్లో బీజేపీ ఓటు బ్యాంకు పెరిగిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు బండి సంజయ్ లాంటి నేతలు ప్రచారానికి రాకపోవటం కూడా మైనస్ అయ్యిందని, ఇతర రాష్ట్రాల సీఎంలు, ముఖ్య నేతలు ప్రచారానికి వచ్చినా పెద్దగా ఒనగూరిందేమీ లేదని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలే అభిప్రాయపడుతున్నారు.

ఓట్లు పెరిగాయనే సంతృప్తిలో కమలం..

గెలుస్తామన్న సీటు గెలవకపోయినా కనీసం చెప్పుకోదగ్గ స్థాయిలో ఓటు బ్యాంకు పెరిగిందనే సంతోషంతో కొందరు బీజేపీ నేతలు సర్దుకుపోతున్నారు. ఇప్పటికే వరంగల్‌లో ఓటమిపై అధిష్ఠానం ఆరా తీస్తుండటంతో ప్రధానంగా పోల్‌మేనేజ్‌మెంట్ కారణంగానే ఓడిపోయామని కీలక నేతలు సమాధానం ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే వరంగల్‌తూర్పులో మొదటి స్థానంలోకి రావటంతో పాటు భూపాలపల్లి, పరకాల, వర్ధన్నపేట, వరంగల్‌పశ్చిమ నియోజకవర్గాల్లో ద్వితీయ స్థానంలో నిలిచామని బీజేపీ నేతలు అధినాయకత్వానికి వివరిస్తున్నారు. అంతేకాకుండా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో కేవలం 1,56,638 ఓట్లు మాత్రమే పోలయితే.. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో 3,60,955ఓట్లు పోలయ్యాయనని, అప్పటికి ఇప్పటికి 2,04,317 ఓట్లు పెరిగాయని బీజేపీ నేతలు లెక్కలు వేస్తున్నారు.

గత అసెంబ్లీ, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పోలయిన ఓట్లు ఇలా..

నియోజకవర్గం	అసెంబ్లీ	లోక్‌సభ
స్టేషన్‌ఘనపూర్	4,984	40,332
పాలకుర్తి	2,982	28,452
పరకాల	38,735	44,841
వరంగల్ పశ్చిమ	30,826	60,611
వరంగల్ తూర్పు	52,105	74,581
వర్ధన్నపేట	12,275	57,427
భూపాలపల్లి	14,731	49,631
పోస్టల్	00	5,080
మొత్తం	1,56,638	3,60,955

ప్రజల తీర్పును గౌరవిస్తున్నా

- వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్



మీడియాతో మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

రాంనగర్, జూన్ 6: ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ప్రజల తీర్పును గౌరవిస్తున్నానని వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ మారేపల్లి సుధీర్‌కుమార్ తెలిపారు. గురువారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో సుధీర్‌కుమార్ మాట్లాడారు. వరంగల్ లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన తన గెలుపు కోసం పార్టీ శ్రేణులు, నేతలు ఎంతగానో శ్రమించినట్లు తెలిపారు. వారందరికీ ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ప్రజల తీర్పును శిరసావహిస్తున్న తాను.. బీఆర్ఎస్ ఇచ్చే కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజల పక్షాన పోరాడుతానన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి డబ్బులు పంపిణీ చేసి గెలిచిందని ఆయన ఆరోపించారు. 64మంది ఎమ్మెల్యేలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఎంపీ ఎన్నికల్లో కేవలం 8 సీట్లకే పరిమితమైందన్నారు. ముఖ్యమంత్రి ఇలాఖాలో సైతం బీజేపీ గెలిచిందంటే ఆయన పాలన ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సుధీర్‌కుమార్ సూచించారు. ఈ విలేకర్ల సమావేశంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నేతలు పులి రజనీకాంత్, జోరిక రమేశ్, చింతల యాదగిరి, కుసుమ లక్ష్మీనారాయణ, రామ్మూర్తి, నయీమ్, చంద్రమోహన్, సల్వాజి రవిందర్‌రావు, రజనీకుమార్, సారంగపాణి, చాగంటి రమేశ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

తొలి ప్రాధాన్యంలో తేలని ఫలితం

నల్లగొండలో కొనసాగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

- ఫస్ట్‌ప్రయారిటీలో మల్లన్నకు 18,565ఓట్ల ఆధిక్యం
- ద్వితీయ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి
- మొదటి ప్రాధాన్య కోటా ఓట్లు రాకపోవడంతో ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ప్రారంభం
- అశోక్‌కుమార్, ప్రేమేందర్‌రెడ్డి ఓట్లే కీలకం
- నేటి సాయంత్రానికి తుదిఫలితం వచ్చే అవకాశం



వివరాలు వెల్లడిస్తున్న రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన

నల్లగొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): శాసనమండలి నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉపఎన్నిక ఫలితం ఇంకా తేలలేదు. గురువారం రాత్రికి మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయినా కోటా ఓట్లు రాకపోవడంతో రెండో ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రానికి గానీ విజేతపై స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. గురువారం మొదటి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్‌కుమార్ (తీన్మార్ మల్లన్న) 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ఆయనకు 1,22,813 మొదటి ప్రాధాన్య ఓట్లు రాగా బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేష్‌రెడ్డి 1,04,248 ఓట్లతో ద్వితీయ స్థానంలో ఉన్నారు. రాకేశ్‌రెడ్డి కంటే మల్లన్నకు 18,565 ఓట్ల ఆధిక్యత లభించింది. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి 43,313 మొదటి ప్రాధాన్య ఓట్లతో మూడోస్థానంలో ఉండగా, నల్లగొండకు చెందిన స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ 29,697మొదటి ప్రాధాన్య ఓట్లు సాధించి నాలుగోస్థానంలోకి వచ్చారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో గతానికి భిన్నంగా అత్యధికంగా 25,824 చెల్లనిఓట్లున్నాయి. మొత్తం చెల్లిన ఓట్ల ఆధారంగా 1,55,095 ఓట్లను కోటా ఓటుగా రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ప్రకటించారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో ఆధిక్యత సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కోటా ఓటు సాధించాలంటే ఆయనకి ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో 32,282 ఓట్లు రావాల్సి ఉంది. అదే రాకేష్‌రెడ్డి గెలవాలంటే 50,847 ఓట్లు రావాల్సి ఉంది. ఈ ఉపఎన్నికలో మొత్తం 52మంది అభ్యర్థులు బరిలో ఉన్న ఈ ఎన్నికలో నలుగురికి మినహా మిగిలిన అభ్యర్థులందరికీ అతి తక్కువ ఓట్లే వచ్చాయి. కొందరికి డబుల్ డిజిట్ ఓట్లే రావడం గమనార్హం. అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ మొదలుపెట్టి వారి ద్వితీయ ప్రాధాన్య ఓట్లను పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులకు కలుపుతూ వస్తారు. ఇలా ప్రధాన అభ్యర్థులు మినహా మిగిలిన

మిగతా 8వ పేజీలో..

మొత్తం ఓట్లు:	4,63,839
పోలైన ఓట్లు:	3,36,013
అభ్యర్థుల సంఖ్య:	52
మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు వివరాలు	
చెల్లని ఓట్లు	:25,824
చెల్లిన ఓట్లు	:3,10,189
కోటా ఓటు	:1,55,095

అభ్యర్థి (పార్టీ)	మొదటి రౌండ్	రెండో రౌండ్	మూడో రౌండ్	నాలుగో రౌండ్	మొత్తం
తీన్మార్ మల్లన్న (కాంగ్రెస్)	36,210	34,574	35450	16,579	1,22,813
ఏనుగు రాకేష్‌రెడ్డి (బీఆర్ఎస్)	28,540	27,574	31242	16,892	1,04,248
గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి (బీజేపీ)	11,395	12,843	10278	8,797	43,313
పాలకూరి అశోక్ (స్వతంత్ర)	9,109	11,214	7170	2,204	29,697
చెల్లని ఓట్లు	7,728	7,398	8,658	2,040	25,824



400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు

- ఉమ్మడి పది జిల్లాల నుంచి 971మంది క్రీడాకారులు హాజరు
- జేఎన్ఎస్ వేదికగా రెండు రోజుల పాటు క్రీడలు
- పాల్గొన్న అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లు

7

గ్రూప్-1 పరీక్షకు ఏర్పాట్లు

వరంగల్ కలెక్టరేట్, జూన్ 6: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి తప్పిదాలకు తావివ్వొద్దని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. గురువారం రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఇతర రాష్ట్రస్థాయి అధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి గ్రూప్-1 పరీక్ష నిర్వహణ, వానాకాలం సీజన్‌లో విత్తనాలు, ఎరువుల లభ్యత, మిషన్ భగీరథ, తాగునీటి సరఫరాపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు కట్టుదిట్టంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 9న ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే పరీక్షకు జిల్లాలో 17 కేంద్రాలు ఏర్పాటు చేయగా 9,168 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నట్లు వివరించారు. డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు, రూట్ అధికారులు, ఇన్విజిలేటర్లను నియమించామని, ప్రతీ కేంద్రంలో సీసీ కెమెరాల నిఘా, బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్న తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, డీఈవో వాసంతి, జిల్లా వ్యవసాయ అధికారి ఉషా దయాల్, ఏసీపీ నందిరాంనాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఐసెట్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6 : ఐసెట్-2024 గురువారంతో ప్రశాంతంగా ముగిసింది. రెండు రోజులు సీబీటీ పద్ధతిలో జరుగుతున్న ఐసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతగా ముగిసిందని ఐసెట్ కన్వీనర్ ఎస్. నర్సింహాచారి తెలిపారు. బుధ, గురువారాల్లో ఆంధ్ర, తెలంగాణలో జరిగిన పరీక్షకు 86,156 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 77,942 మంది (90.47 శాతం) విద్యార్థులు హాజరయ్యారు. వరంగల్, నర్సంపేట రీజియన్‌లో ఎంపిక చేసిన 8 పరీక్ష కేంద్రాల్లో 4,659 మందికి గాను 4,364 మంది విద్యార్థులు హాజరయ్యారు. జూన్ 8న ఐసెట్ ప్రాథమిక కీ విడుదల చేస్తున్నట్లు కన్వీనర్ పేర్కొన్నారు. అభ్యంతరాలున్న విద్యార్థులు జూన్ 8, 9 తేదీల్లో ఐసెట్-2024 పోర్టల్‌లో వారి అభ్యంతరాలను నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి: డీసీపీ



సదస్సులో మాట్లాడుతున్న డీసీపీ రవీందర్

శంభునిపేట, జూన్ 6 : దేశ వ్యాప్తంగా జూలై 1 నుంచి ప్రారంభం కానున్న కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ పోలీసులకు సూచించారు. నూతన చట్టాలపై అవగాహన పెంచేందుకు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా ఆదేశాల మేరకు కమిషనరేట్‌లోని పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణను అందిస్తున్నారు. అందులో భాగంగా బొల్లి కుంట వాగ్దేవి కళాశాలలో సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని డీపీపీ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ తరగతులను ప్రారంభించారు. డీసీపీ మాట్లాడుతూ.. ఒకటో తేదీ నుంచే కొత్త చట్టాలను అమలు చేసేందుకు భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇందుకోసం మామునూరు, పరకాల, నర్సంపేట డివిజన్‌లకు చెందిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ శిక్షణ తరగతులలో కొత్త చట్టాలైన భారతీయ న్యాయసంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం 2023 చట్టాలపై అధికారులకు, సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏసీపీలు తిరుపతి, కిషోర్, ఇన్‌స్పెక్టర్‌లు రవికుమార్, శ్రీనివాస్, రంజిత్‌రావు, పవన్, రమేష్, క్రాంతికుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి దోపిడీ దొంగల బీభత్సం

నష్కల్ వద్ద నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీ

చిలుపూర్/కాజీపేట, జూన్ 6: నాగర్‌సోల్ నుంచి నర్సాపూర్ వెళ్తున్న నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జనగామ జిల్లా చిలుపూర్ మండలంలోని నష్కల్ - పెండ్యాల రైల్వే ట్రాక్ వద్ద దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. అర్ధరాత్రి 1 గంట ప్రాంతంలో రైలు ఆగిన తర్వాత నిద్ర మత్తులో ఉన్న ప్రయాణికుల మెడల్లోంచి దొంగల ముఠా బంగారు ఆభరణాలు, మొబైల్‌ఫోన్‌లు, బ్యాగులు చోరీ చేశారు. ఎస్-2, ఎస్-3, ఎస్-5తోపాటు ఎస్-11 స్లీపర్ కోచ్‌లలో ఈ చోరీలు జరిగినట్లు తెలుస్తోంది. కాజీపేట రైల్వే జీఆర్పీ ఎస్సై మొయినొద్దీన్, బాధితురాలు అన్నె కవిత తెలిపిన వివరాలు ప్రకారం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ ఇబ్రహీంపట్నంకు చెందిన అన్నెపు కవిత.. తన భర్త సాయిరమేశ్, ఇద్దరు పిల్లలు, మామతో కలిసి షిరిడీ దర్శనానికి వెళ్లింది. తిరిగి విజయవాడకు వచ్చేందుకు సికింద్రాబాద్‌లో నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. అయితే నష్కల్ రైల్వేస్టేషన్ సమీపంలో అండర్‌బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా నర్సాపూర్ రైలు నష్కల్ సమీపంలోకి రాగానే లోకోపైలెట్ వేగం తగ్గించాడు. అయితే దుండగులు ఇదే అదునుగా భావించి ఆ రైలులో కిటికీ పక్కన నిద్రిస్తున్న అనిత మెడలో ఉన్న బంగారు గొలుసును బయటనుంచి లాగారు. మధ్య బెర్త్‌లో నిద్రిస్తున్న కవిత మెడలో నుంచి ఎవరో చైన్‌లాగినట్లు అనిపించడంతో ఒక్కసారిగా అప్రమత్తమై లేచింది. అప్పటికే దుండగులు గొలుసు లాగేశాడు. అలాగే అమె మెడలో నుంచి మరో బంగారు తాళిని తెంపే క్రమంలో గట్టిగా పట్టుకుంది. కిటికీల్లో నుంచి చూడగా దుండగులు ఒకరి భుజంపై మరొకరు ఎక్కి, కిటికీల వద్ద ఉన్న ప్రయాణికుల బంగారం, ఇతర వస్తువులు చోరీలు చేస్తున్నారు. దీంతో కవిత పెద్దగా కేకలు వేయడంతో నిద్రమత్తులో ఉన్న మిగతా ప్రయాణికులు అందరూ లేచారు. కవిత కేకలకు పారిపోతున్న దొంగలను చూసిన ప్రయాణికులు రైలు దిగి రాళ్లతో దాడి చేస్తూ దొంగలను పట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే దొంగలు సైతం రైల్వే ట్రాక్ వద్ద ఉన్న రాళ్లతో ప్రతిదాడులు చేశారు. వెంటనే ప్రయాణికులు తిరిగి రైలెక్కి రైల్వే అధికారులకు సమాచారం అందించారు. అప్రమత్తమమైన రైల్వే అధికారులు రైల్వే టోల్‌ఫ్రీకి ఫిర్యాదు చేశారు. ఆపై రైలు యథావిధిగా వెళ్లింది.

గురువారం ఉదయం రైల్వే జీఆర్పీ పోలీసులతో పాటు, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, చిలుపూర్ ఎస్‌ఐ ముత్యం రాజేందర్ తదితరులు ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. కాగా, కవిత తన కుటుంబంతో సహా విజయవాడకు వెళ్లి తిరిగి గురువారం ఉదయం కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. 12 గ్రాముల బంగారు చైన్‌తో పాటు ఇతర వస్తువులు చోరీ జరిగిందని ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయాలపై పోలీసులను వివరణ అడగగా.. నష్కల్ స్టేషన్ సమీపంలో జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనుల దృష్ట్యా రైలు మెళ్లగా వస్తుండడంతో దుండగులు దోపిడీకి పాల్పడ్డారా..? అదే రైలులో వచ్చి రైలు ఆగగానే దోపిడీ చేశారా? అనే విషయాలపై ఆరా తీస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఎంతమంది ప్రయాణికుల బంగారం, ఇతర వస్తువులు చోరీ అయ్యాయో పూర్తి వివరాలు తెలియడం లేదన్నారు. బాధితులు ఫిర్యాదు చేసిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని పోలీసులు అంటున్నారు.

ఇదిలా వుండగా, అర్ధరాత్రి చీకటిలో జరిగిన ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సినీ పక్కీలో జరిగిన ఈ చోరీలను చూస్తున్న ఇతర ప్రయాణికులు అసలు ఏమి జరుగుతుందో అర్థంకాకుండా ఉండిపోయారు. తొలుత దోపిడీ దొంగలు అర్ధరాత్రి రైల్లోకి చొరబడి మహిళలను మారణాయుధాలతో బెదిరించి వారి మెడల్లోంచి 25 తులాల బంగారాన్ని దోచుకెళ్లినట్టు తొలుత ప్రచారం జరిగింది. అయితే ఈ చోరీల్లో సుమారు 20 మంది ముఠా సభ్యులు పాల్గొన్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు.


నష్కల్ రైల్వేస్టేషన్ సమీపంలో విచారణ చేపడుతున్న పోలీసులు

28న డాక్ అదాలత్

సుబేదారి, జూన్ 6: తపాలా శాఖకు సంబంధించిన ఫిర్యాదులు ప్రజల నుంచి స్వీకరించేందుకు ఈ నెల 28న పోస్టు మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్ హైదరాబాద్ వారు 46 డాక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల14 లోపు కె.శ్రీకాంత్ అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్ అండ్ విజిలెన్స్), ఆఫీస్ ఆఫ్ పోస్టు మాస్టర్ జనరల్ హైదరాబాద్ రీజియన్, హైదరాబాద్ 500001కు వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాల్‌పల్లి, జనగామ జిల్లాల ప్రజలు ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు. పోస్టల్ కవర్‌పై 46 డాక్ అదాలత్ అని రాసి పంపించాలని సూపరింటెండెంట్ తెలిపారు.

రేపటి నుంచి దూరవిద్య పీజీ ప్రాక్టికల్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6: కేయూ దూరవిద్య పీజీ బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఫస్టియర్ పరీక్షల ప్రాక్టికల్ పరీక్షలు శనివారం (జూన్ 8)నుంచి ప్రారంభిస్తున్నట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి. రామచంద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న బోటనీ, 9న ఫిజిక్స్, 12న జువాలజీ, కెమిస్ట్రీ, 13న కెమిస్ట్రీ మరో పేపర్ ఉంటాయని తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత డిపార్ట్‌మెంట్లలో జరుగుతాయని పేర్కొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు

జేఎన్ఎస్‌లో ఉమ్మడి పది జిల్లాల నుంచి 971మంది క్రీడాకారులు హాజరు



100 మీటర్ల పరుగు పందెంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో అతిథులు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 6: హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి యూత్ బాలుర, కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. యూత్ బాలుర, కిడ్స్ అండర్- 8, 10, 12, 14, 16, 20 బాలబాలికల, మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో ఉమ్మడి పది రాష్ట్రాల నుంచి 971మంది అథ్లెట్లు, 100మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు పాల్గొన్నారు. అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల ప్రారంభ కార్యక్రమానికి 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లుగా తీర్చిదిద్దుతున్న ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ హనుమకొండ వాస్తవ్యుడు కావడం మనకు ఎంతో గర్వకారణమని కొనియాడారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మొదటి రోజు 1000, 1500, 10వేల మీటర్ల పరుగు పందెం, షాట్ ఫుట్, లాంగ్‌జంప్, 400, 100 మీటర్ల పరుగు పందెం, హైజంప్, 300మీటర్ల పరుగు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 150మీటర్ల పరుగు, 80, 50 మీటర్లు పరుగు, 110 మీటర్ల హర్డిల్స్, హెప్టథ్లాన్, డెకాథ్లాన్, జావెలిన్‌త్రో, ట్రిపుల్‌జంప్, 3వేల మీటర్ల స్టీపుల్‌చేస్, 4ఇంటూ400రిలే విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ స్థాయిలో ప్రతిభ కనబర్చిన యూత్ అథ్లెట్లు జూన్ 15 నుంచి 17 వరకు చత్తీస్‌గడ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు. అదే విధంగా సీనియర్స్ అథ్లెటిక్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అథ్లెట్లు జూన్ 27నుంచి 30 వరకు హరియాణా రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు.

కాగా, అథ్లెటిక్స్ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అంతర్జాతీయస్థాయి అథ్లెట్లు జీవంజి దీప్తి, అగసర నందిని, సాయి సంగీతలు క్రీడా మైదానంలో సందడి చేశారు. అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లను చూసి మైదానంలో పలువురు చిన్నారులు, వర్ధమాన అథ్లెట్లు సెల్ఫీలను దిగుతూ అలరించారు. ఈ సందర్భంగా పారా ఒలంపియన్ జీవంజి దీప్తి, ఏషియన్ గేమ్స్ బ్రాంజ్ మెడలిస్ట్ నందినిలను తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడంతోపాటు ఒక్కొక్కరికి రూ.50వేల చెక్కును అసోసియేషన్ బాధ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు స్టాన్‌లీజోన్స్, చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, డీవైఎస్‌వో గుగులోత్ అశోక్, అసోసియేషన్ బాధ్యులు పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, యుగేంధర్‌రెడ్డి, చంద్రమోహన్, నాగరాజు, కోచ్‌లు శ్రీమన్నారాయణ, పీఈటీలు వాసుదేవ్, మనోజ్‌కుమార్, సోమేశ్వర్, జగన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విజయ సంకేతం చూపుతున్న అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లు

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి..

జీవంజి దీప్తి, అంతర్జాతీయస్థాయి పారా అథ్లెట్, కల్లెడ

జపాన్ దేశంలోని యూనివేసియేడ్ మెమోరియల్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఉమెన్ టీ20 చాంపియన్‌షిప్ 400మీటర్ల పరుగుపందెంలో 55.07 సెకన్లలో గమ్యాన్ని చేరి ప్రపంచ రికార్డు నెలకొల్పాను. అథ్లెటిక్స్‌లో పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికలపై స్వర్ణ, రజత పతకాలు సాధించినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహం అందించడం లేదు. నిరుపేద కుటుంబంలో జన్మించిన నాకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పించాలి. రాష్ట్ర ప్రభుత్వం దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చే ప్రతిభ కలిగిన క్రీడాకారులకు భరోసాగా నిలవాలి.

ఒలింపిక్స్‌లో అర్హత సాధించడమే లక్ష్యం

సాయి సంగీత, అంతర్జాతీయ స్థాయి అథ్లెట్ మహబూబ్‌నగర్

ఇటీవల దుబాయ్‌లో నిర్వహించిన జూనియర్ ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 4ఇంటూ400రిలేలో స్వర్ణం సాధించాను. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే కఠోర సాధన చేయాలి. కోచ్‌ల ప్రత్యేక శిక్షణలో తర్ఫీదు పొందుతూ వారు చూపించిన విధంగా నడుచుకుంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు. హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో చదువుకుంటూ అక్కడి కోచ్ వద్ద అథ్లెటిక్స్‌లో శిక్షణ తీసుకున్నాను. సంవత్సర కాలంగా కర్నాటక రాష్ట్రంలోని మంగుళూర్‌కు చెందిన కోచ్ అజిత్ కుమార్ వద్ద శిక్షణ తీసుకుంటూ అక్కడే డిగ్రీ ప్రథమ సంవత్సం చదువుతున్నా.

అంతర్జాతీయ క్రీడాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి..

అగసర నందిని, ఏషియన్ గేమ్ మెడలిస్ట్ హైదరాబాద్

అంతర్జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొని పథకాలు సాధించిన క్రీడాకారులకు నగదు ప్రోత్సహంతోపాటు నివాస స్థలం కేటాయించాలి. ఇతర రాష్ట్రాల్లో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించిన క్రీడాకారులు నగదు ప్రోత్సాహం అందిస్తున్నారు. ఇటీవల చైనాలో జరిగిన హెప్టథ్లాన్ పోటీల్లో తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాను. ఈ నెల 27నుంచి 31 వరకు హరియాణా రాష్ట్రంలోని పంచకుల లో నిర్వహించనున్న అంతర్ రాష్ట్రాల హెపథ్లాన్ పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించి ఒలంపిక్స్ అర్హత సాధించేందుకు కసరత్తు చేస్తున్నా.

దర్గాలో ప్రార్థనలు.. అమ్మవారికి పూజలు

కాజీపేట దర్గా, భద్రకాళిని దర్శించుకున్న కడియం కావ్య



కాజీపేట దర్గాలో ప్రార్థన చేస్తున్న కడియం శ్రీహరి, కావ్య తదితరులు



భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కావ్యకు ప్రసాదం అందిస్తున్న అర్చకులు

కాజీపేట టౌన్ / వరంగల్ కల్చరల్, జూన్ 6: లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన కడియం కావ్య గురువారం కాజీపేట దర్గా, వరంగల్ భద్రకాళి ఆలయాలను సందర్శించారు. తన తండ్రి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి కాజీపేట దర్గాకు వచ్చిన ఆమెకు పీఠాధిపతి ఖుస్రుపాషా ఘన స్వాగతం పలికారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తాను వరంగల్ ప్రజలకు రుణపడి ఉంటానని, తనకు అండగా నిలిచి అత్యధిక మెజారిటీతో గెలిపించిన ముస్లింలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వరంగల్ అభివృద్ధి కోసం శ్రమిస్తానన్నారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ.. మతసామరస్యానికి ప్రతీకగా కాజీపేట దర్గా విలసిల్లుతోందన్నారు. వారి వెంట మాజీ కార్పొరేటర్ అబూబకర్, మతపెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు. అలాగే పలువురు కుటుంబ సభ్యులతో కలిసి కావ్య భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానార్చకుడు భద్రకాళి శేషు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను కావ్యకు అందజేశారు. అనంతరం కావ్య మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఉండేలా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కావాల్సిన తోడ్పాటును అందించాలని వేడుకున్నానన్నారు.

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ అకాడమీలోని డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు

దరఖాస్తుల దాఖలు గడువు పెంపు

హనుమకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని ఆశోక్‌నగర్‌లో తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సైనిక్ స్కూల్/ఆకాడమీలో 2024-25 సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో బీఏ (హెచ్ఈపీ), బీఎస్సీ (ఎంపీసీ) 40 చొప్పున సీట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని వరంగల్, కరీంనగర్ రీజినల్ కోఆర్డినేటర్ డీఎస్ వెంకన్న ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తుల దాఖలకు చివరి తేదీని జూన్ 15 వరకు పొడిగించినట్టు తెలిపారు. ఈ కోర్సులలో ప్రవేశానికి విద్యార్హత ఇంటర్, రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారని, ఫీజు రూ.100 అని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని వివరాలను నింపి సంబంధిత పత్రాలు జత చేసి ప్రిన్సిపాల్, టీటీడబ్ల్యూఆర్ సైనిక్ స్కూల్ (బి), ఆశోక్‌నగర్ పేరు మీదరూ. 100 డీడీ తీసి లేదా కింది ఏదేని నెంబర్‌కు యూపీఐ ద్వారా చెల్లించి స్క్రీన్ షాట్ జిరాక్స్, పూర్తి దరఖాస్తు కాపీని ప్రిన్సిపాల్ టీటీడబ్ల్యూఆర్ సైనిక్ స్కూల్ ఆశోక్‌నగర్, మండలం ఖానాపురం, వరంగల్ జిల్లా పిన్ కోడ్ 506132కు పంపాలని కోరారు. లేదా సంబంధిత జిరాక్స్ పత్రాలు (ఎస్ఎస్‌సీ మెమో, ఇంటర్ షార్ట్ మెమో, బోనోఫైడ్స్, క్యాస్ట్, ఇన్‌కమ్, రెసిడెన్స్ సర్టిఫికెట్లు, 5 ఫోటోలు) తీసుకొని నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు 9963584516, 9398068250, 8985469347 8978616155, 9553310104నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు. వెబ్‌సైట్ https://www.tgtwgurukulam.telangana.gov.in చూడాలని కోరారు.

కేయూ పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షల రీషెడ్యూల్ ప్రకటన

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6: కేయూ పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్‌ను రీషెడ్యూల్ చేస్తూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి పేపర్ జూన్ 11న, రెండో పేపర్ 13న, మూడో పేపర్ 15న, నాలుగో పేపర్ 19న, ఐదో పేపర్ 21న, ఆరో పేపర్ జూన్ 24న ఉన్నట్లు తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్ పోర్టల్‌లో చూడాలని సూచించారు.



రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రవి(ఫైల్)

సంగెం, జూన్ 6: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందగా, మరొకరు చికిత్స పొందుతున్నారు. సంగెం ఎస్సై నరేష్ కథనం ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం మండలం రౌతుగూడెంకు చెందిన మాలోతు రవి(34) తన భార్య సరిత, తల్లిసోనాలతో కలిసి సంగెం మండలం తిమ్మాపురం ఓ కార్యక్రమానికి బుధవారం ఉదయం వెళ్లారు. సాయంత్రం బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. మండల కేంద్రానికి వచ్చేసరికి ఓ బాలుడు ద్విచక్రవాహనం నడుపుతూ వచ్చి ఢీకొట్టాడు. దీంతో రవి, సరిత, సోనా గాయపడ్డారు. స్థానికులు సాయంతో క్షతగాత్రులను ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి రవి మృతి చెందగా, తల్లి సోనా ఆస్పత్రిలో చికిత్సపొందుతోంది. గురువారం మృతుడి భార్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గంగదేవిపల్లిని సందర్శించిన మహిళ లీడర్లు

గంగదేవిపల్లిని సందర్శించిన పొదుపు సంఘాల మహిళలు

గీసుగొండ, జూన్ 6: జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని భూపాలపల్లి జిల్లాలోని 10గ్రామాలకు చెందిన 15 మంది మహిళ సంఘాల లీడర్‌లు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఐక్యత, సాధించిన విజయాలను ట్రేయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి బృందానికి వివరించారు. గ్రామాభివృద్ధి కమిటీలలో మహిళలు కీలకపాత్ర పోషించటమే కాకుండా ఓ టర్మ్ సర్పంచ్‌తో సహా వార్డు సభ్యులందరిని మహిళలనే ఎన్నుకున్న ఘనత గంగదేవిపల్లికి దక్కిందన్నారు. గ్రామాల అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం అన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఏరియా కమిటీ లీడర్ సుబ్రహ్మణ్యం, కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు పద్మ, వెంకటేశ్వరమ్మ, ఇంజనీర్ ప్రవీణ్‌కుమార్, గ్రామ ఆర్పీలు మేడిద సుశీల, గూడ సరోజన పాల్గొన్నారు.

పుష్పాలగుట్ట.. సమస్యల పుట్ట..

• చినుకు పడితే చిత్తడే • డ్రెయినేజీ అస్తవ్యస్తం • తాగునీటికి తండ్లాటే

మిల్స్‌కాలనీ, జూన్ 6: వరంగల్ మహానగరం 36వ డివిజన్‌లోని పుష్పాలగుట్ట సమస్యల పుట్టగా మారింది. పుష్పాలగుట్టలో చినుకుపడితే రోడ్లన్ని చిత్తడిగా మారుతున్నాయి. రోడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో వర్షపు నీటికి బురదమయమవుతున్నాయి. ఖాళీ ప్రదేశాల్లో నీరు చేరి అపరిశుభ్ర పరిసరాలుగా మారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షాకాలం కావస్తుండటంతో స్థానిక ప్రజలు పక్కనున్న మురికి గుంటలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. చిన్న చినుకు పడితే చాలు ఖాళీ ప్రదేశాలు కుంటలను తలపిస్తుంటాయని, వాటితో రోగాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పుష్పాలగుట్ట ప్రాంతంలో డ్రెయినేజీ అస్తవ్యస్తంగా తయారయ్యింది. కాలువలు పూర్తిగా చెత్తా చెదారంతో నిండిపోయాయి. దీంతో మురుగునీరు రోడ్లపైకి దుస్థితి నెలకొని ఉంది. ఇక రైల్వే ట్రాక్ పక్కన అండర్ డ్రెయినేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పక్కనున్న మురుగు కాలువ అంతా చెత్తతో నిండి ఉంది. దీంతో కల్వర్టుల వద్ద నీరు రోడ్డుపైకి పారుతుంది.



చెత్త, చెదారంతో నిండిన మురుగు కాల్వలు



బావికి అమర్చిన మోటార్లు

తాగునీటికి తండ్లాటే...

పుష్పాలగుట్టలోని ఓ బావికి ఏర్పాటు చేసిన మోటార్లను చూస్తే తెలుస్తుంది ఇక్కడ తాగు, అవసరాలకు ఉపయోగించే నీటికి ఎంత ఎద్దడి ఉందో. మిషన్ భగీరథ పైపులైన్లు ఏర్పాటు చేసినా నీరు సరఫరా అంతగా లేదు. పుష్పాలగుట్టలో ఏర్పాటు చేసిన 15 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న నీటి ట్యాంకు వృథా గా మారింది. నీరు ట్యాంకులోకి ఎక్కకపోవడంతో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికీ ఈ కాలనీ వాసులు ప్రాచీన బావులకు మోటార్లు బిగించి, స్టేటిక్ ట్యాంకులపై ఆధారపడుతున్నారు. మున్సిపాలిటీ ట్యాంకర్లు సైతం సరిగ్గా రాకపోడంతో తాగునీరుతో పాటు ఇతరత్ర అవసరాలకు కావాల్సిన నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నట్లు స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

ఈటలను కలిసిన బీజేపీ నేతలు



ఈటలను కలిసి సత్కరిస్తున్న బీజేపీ నేతలు

సంగెం, జూన్ 6: మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలుపొందిన ఈటల రాజేందర్‌ను బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని ఈటల ఇంట్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబరు గట్టికొప్పుల రాంబాబు, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు కాగితాల సాయికుమార్, బదావత్ రాజన్, నన్నెబోయిన శ్రీనివాస్, నాతి అనిల్‌తోపాటు పార్టీకి చెందిన నాయకులు ఈటలను సత్కరించారు.

బండి సంజయ్‌ని కలిసిన బీజేపీ శ్రేణులు

పోచమ్మమైదాన్, జూన్ 6: కరీంనగర్ ఎంపీగా గెలుపొందిన బండి సంజయ్‌ని గురువారం 12వ డివిజన్‌కు చెందిన భారతీయ జనతా పార్టీ నాయకుడు గోకె వెంకటేష్ కలిశారు. కరీంనగర్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే సంజయ్‌ని బీజేపీ నాయకుడు గాదె రవీందర్ మర్యాద పూర్వకంగా కలిశారు.



సంజయ్‌తో వెంకటేష్

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, జూన్ 6: వరంగల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనం నడిపిన వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి గురువారం జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన ఇద్దరు వాహనదారులకు రూ.2000, మద్యం తాగి వాహనం నడిపిన వాహనదారులకు 8 మందికి రూ. 5వేల 900 జరిమాన విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

మొగిలయ్యను పరామర్శించిన డీఎంహెచ్‌వో

పోచమ్మమైదాన్, జూన్ 6: మూత్ర సంబంధిత వ్యాధితో బాధపడుతూ సంరక్ష ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బలగం సినిమా ఫేం, కళాకారుడు మొగిలయ్యను గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటరమణ పరామర్శించారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు మొగిలయ్యను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సేవలలో ఎలాంటి లోటు రాకుండా చూడాలని, మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం అతని భార్య కొమురమ్మ, కుమారుడు సుదర్శన్, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



మొగిలయ్యను పరామర్శిస్తున్న వెంకటరమణ

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

గీసుగొండ: గీసుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కాజీపేట వెంకటరమణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అమలవుతున్న జాతీయ కార్యక్రమాలు, టార్గెట్‌ల పూర్తిపై ఆరాతీశారు. రాబోయే సీజనల్ వ్యాధులతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమయపాలన విధిగా పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్చన, సీహెచ్‌వో మధుసూదన్‌రెడ్డి, సూపర్‌వైజర్‌లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



తహసీల్దారు మహ్మద్ ఇక్బాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ధర్మసమాజ్ పార్టీ శ్రేణులు

'విశారదన్ రూపొందించిన చిహ్నాన్ని ఆమోదించాలి'

పోచమ్మమైదాన్, జూన్ 6: ధర్మ సమా జ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ రూపొందించిన చిహ్నాన్ని రాష్ట్ర చిహ్నంగా ఆమోదించాలని ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దామెర శ్రవణ్ కోరారు. ఈమేరకు గురువారం వరంగల్ తహసీల్దారు మహ్మద్ ఇక్బాల్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజల వారసత్వ ప్రేరణను కొనసాగించేందుకు విశారదన్ మహారాజ్ చిహ్నాన్ని రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రసంగిపాల్, దామెర దినేష్, ఠాగూర్ పాల్గొన్నారు.

ప్రారంభమైన బడిబాట

బడిబాట నిర్వహిస్తున్న మామునూర్ క్యాంపు జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. గురువారం నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బడిబాట బ్యానర్‌తో ఆవాసప్రాంతంలో ప్రచారాన్ని ప్రారంభించారు. ఈనెల 19 వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు.

ఇంటింటి ప్రచారంలో ఉపాధ్యాయులు

గీసుగొండ: ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలకే పిల్లలను పంపించాలని కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. బడిబాటలో భాగంగా గురువారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో సమావేశాలు నిర్వహించిన అనంతరం విద్యార్థుల ఇంటికి వెళ్లి ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్‌లు, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్య గురించి వివరించారు. బాసర ట్రిపుల్ ఐఐటీ లాంటి విద్యాసంస్థల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకే సీట్లు ఇస్తున్నట్లు చెప్పారు. గీసుగొండ, వంచనగిరి, మచ్చాపూర్, కొమ్మాల, ఎలుకుర్తి, గొర్రెకుంట, ధర్మారం, శాయంపేట, మొగిలిచర్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రచారంలో పాల్గొన్నారు.

పాఠశాలలో వసతులను పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

గీసుగొండ, జూన్ 6: పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు, వసతుల ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి దేవేందర్ అన్నారు. గీసుగొండ జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎంల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాంలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణవేణి, సెక్టోరియల్ ఆఫీసర్ సుభాష్, ఎంఎన్‌వో రవీందర్, పట్టాభి, ఏపీఎం సురేష్, సీఆర్పీలు సుధాకర్, రవి, వెంకటరమణ, ఎంఐఎస్ సారిక, డీవో రాజగోపాల్, శంకర్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు : సీఐ

సంగెం, జూన్ 6: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పర్వతగిరి సీఐ శ్రీనివాస్ డీలర్లను హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో విత్తన, ఎరువుల డీలర్లకు అమ్మకాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ రైతులను మోసం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విక్రయించే ఎరువులు,విత్తనాలు పురుగు మందులు నాణ్యత కలిగి ప్రభుత్వం ఆమోదించిన వాటినే మాత్రమే విక్రయించాలన్నారు. దుకాణాల్లో స్టాక్‌బోర్డు, బిల్లు బుక్కులు అందుబాటులో ఉంచాలని, గడువు దాటిన వాటిని విక్రయించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ గౌస్‌హైదర్, ఎస్సై నరేష్, సంగెం వ్యవసాయాధికారి యాకయ్య, మండల ఫర్టిలైజర్ల సంఘం అధ్యక్షుడు బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా సభ్యుడు గజ్జెల శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని మన గ్రోమోర్, ఎరువుల దుకాణాలను అధికారులు తనిఖీ చేసి షాపులోని స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు.



సంగెంలో ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

పోక్సో కేసు నమోదు

సంగెం, జూన్ 6: సంగెం మండలం సోమ్లతండాకు చెందిన యువకుడి(23)పై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పర్వతగిరి సీఐ శ్రీనివాస్, సంగెం ఎస్సై నరేష్‌లు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఇదే మండలానికి చెందిన యువతితో ప్రేమిస్తున్నానంటూ నమ్మించి ఆమెతో అసభ్యకరంగా ఫొటోలు దిగి, యువతి తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో శారీరకంగా కలిశాడని పేర్కొన్నారు. అలాగే, యువతి తన సోదరి ఇంటికి వచ్చిన సందర్భంగా శారీరకంగా కలవాలని బలవంతం చేయగా, అందుకు నిరాకరించి వివాహం చేసుకోవాలని కోరిందన్నారు. యువకుడు తన వద్ద ఉన్న ఫొటోలు వైరల్ చేస్తానని బెదిరించాడన్నారు. దీంతో యువతి ఫిర్యాదు చేయడంతో గురువారం యువకుడిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చడం జరిగిందన్నారు.

బైక్ దొంగల ముఠా అరెస్టు

8 బైక్‌లు, రూ.10వేల నగదు స్వాధీనం: ఏసీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ

వరంగల్ చౌరస్తా, జూన్ 6: మూడు నెలల నుంచి వరుసగా బైక్ దొంగతనాలకు పాలపడుతున్న ముఠాను గురువారం పట్టుకున్నట్టు వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ తెలిపారు. ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ తెల్లవారు జామున హెడ్‌పోస్టాఫీస్ జంక్షన్‌లో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు మోటారు సైకిళ్లపై వస్తూ, పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నట్టు పేర్కొన్నారు. వారిని విచారించగా రంగు ప్రశాంత్, ఈసంపల్లి ప్రేమ్‌కుమార్‌తోపాటు, బాలుడు, మద్యానికి, జల్సాలకు అలవాటుపడి ముఠాగా ఏర్పడి బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. వరంగల్ సెంట్రల్ జోన్ మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ, సుబేదారి, హనుమకొండ పరిధిలోని మూడు నెలల నుంచి మొత్తం ఎనిమిది మోటారు సైకిళ్లను దొంగతనం చేశారని వెల్లడించారు. దొంగతనం చేసిన బైక్‌లను గిర్మాజీపేటలోని నర్సింహరావు హాస్టల్ సమీపంలో రంగు ప్రశాంత్ తన ఇంటి వద్ద ఎవరికి అనుమానం రాకుండా పార్కింగ్‌లా పెట్టి నష్కల్, జనగామలో తెలిసిన వారికి మోసపూరిత మాటలు చెబుతూ అర్జెంటుగా డబ్బులు అవసరం ఉన్నాయని తక్కువ ధరకు బైక్‌లు విక్రయిస్తున్నట్టు పేర్కొన్నారు. బైక్‌ను విక్రయించడానికి వెళ్తుండగా పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి ఐదు మోటారు సైకిళ్ల, రూ.10వేల నగదును పట్టుకున్నట్టు ఏసీపీ వెల్లడించారు. సమావేశంలో సీఐ మచ్చ శివకుమార్, ఎస్సై వెంకన్న పాల్గొన్నారు.

నేటి నుంచి మృగశిర కార్తె

వరంగల్ కల్చరల్, జూన్ 6: వేసవి రుతువులో దంచికొట్టిన ఎండలతో అతలకుతలమైన ప్రజలకు శుక్రవారం నుంచి కాస్త ఊరట కలుగనుంది. నాలుగు నెలల నుంచి విపరీతమైన ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు మృగశిర కార్తీతో వాతావరణ చల్లబడనుంది. 15రోజుల పాటు రోహిణి కార్తీలో ఎండలు దంచికొట్టాయి. మృగశిర రాకతో తొలకరి జల్లులు కురుస్తాయని ఆశిస్తున్నారు. మృగశిర కార్తీ రోజున చేపమందు వేసే ఆచారం ఉండేది. ఇప్పటికి కొన్ని చోట్ల వేస్తున్నారు. మృగశిర కార్తీ తొలి రోజున చేపలను ఆహారంగా వండుకొని తినడం ప్రతీ ఒక్కరు సంప్రదాయంగా పెట్టుకుంటారు. దీంతో మార్కెట్‌లో చేపలకు గిరాకీ పెరుగనుంది. ఇప్పటికే బొమ్మె చాపలు కిలో ధర రూ. 400 నుంచి రూ. 600 వరకు పలుకుతున్నాయి. శుక్రవారం రోజున ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉంది. వరంగల్‌లోని హండర్‌బ్రిడ్జి, హంటర్‌రోడ్డు, కూరగాయల మార్కెట్, హనుమాన్ల బొడ్రాయి వద్ద చేపలు విక్రయిస్తారు.

తొలి ప్రాధాన్యంలో తేలని ఫలితం

(5వ పేజీ తరువాయి)

48 మంది అభ్యర్థుల ఓట్లు కలిపినా కోటా ఓటు వచ్చే అవకాశం ఉండదు. అయితే ఈ 48 మంది అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియ శుక్రవారం ఉదయం వరకు కొనసాగే పరిస్థితి ఉంది. ఇదే సమయంలో మూడో రౌండ్ ఓట్ల కౌంటింగ్‌పై తమకు అనుమానాలున్నాయని, మళ్లీ లెక్కించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి డిమాండ్ చేయడంతో వాతావరణం వేడెక్కింది. ఎన్నికల సంఘం ఆయన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటుందా? లేదా? అనే అంశం తేలాల్సి ఉంది.

విజేతను తేల్చేది ఆ ఇద్దరి ద్వితీయ ప్రాధాన్య ఓట్లే

స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన నల్లగొండకు చెందిన పాలకూరి అశోక్‌కుమార్, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేట్ అయ్యాక, వారి బ్యాలెట్లలోని ద్వితీయ ప్రాధాన్య ఓట్లే విజేతను తేల్చే అవకాశముందని భావిస్తున్నారు. స్వ తంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన అశోక్‌కుమార్, 48 మంది స్వతంత్ర అభ్యర్థుల తర్వాత ఎలిమినేట్ అవుతారు. ఆయన ఓట్లలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఎవరికి ఏ స్థాయిలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లు వస్తాయనే అంశం కీలకం కానుంది. అయితే కౌంటింగ్ సరళిని పరిశీలిస్తున్న రాజకీయ నేతలు, పరిశీలకులు అశోక్‌కుమార్‌కు చెందిన బ్యాలెట్ల ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో కోటా ఓటు ఎవరికీ రాదని, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ తప్పదని భావిస్తున్నారు. ఆయన బ్యా లెట్ల ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక కోటా ఓటు రావచ్చని అంచ నా వేస్తున్నారు. అయితే అప్పటికీ కోటా ఓటు రాకపోతే రెండో స్థానంలో ఉండే అభ్యర్థికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్య ఓట్లనూ లెక్కిస్తారు. అప్పటికీ కోటా ఓటు రాకపోతే అనూహ్యంగా తృతీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించాల్సి ఉంటుంది. గరిష్ఠంగా ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో ఫలితం తేలుతుందని అంచనా వేస్తున్నారు.

చెమటలు పట్టించిన చెల్లని ఓట్లు

మొదటి ప్రాధాన్య ఓట్లలో చెల్లని ఓట్లు అత్యధికంగా నమోదవడం ప్రధాన పార్టీల అభ్యర్థులను చెమటలు పట్టిస్తున్నాయి. గతంలో ఎన్నడూలేని రీతిలో పోలై న ఓట్లలో దాదాపు 8.50శాతం ఓట్లు చెల్లకుండా పోయాయి. మూడో రౌండ్ వరకే 23,784 ఓట్లు చెల్లకుండా పోగా, ప్రధాన అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగో రౌండ్ ముగిసే సరికి 25,824ఓట్లు చెల్లకుండా పోయాయి. ఎంతో అవగాహన ఉన్న గ్రాడ్యుయేట్ల ఓట్లే ఈ స్థాయిలో చెల్లకుండా పోవడమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాలెట్ పేపర్లపై అడ్డగోలు రాతలు, నినాదాలు, సంతకాలు, ఫోన్ నెంబర్లు, ప్రాధాన్య ఓటు ఇవ్వడంలో నిర్లక్ష్య వైఖరి వంటి కారణాలతో ఓట్లు చెల్లకుండా పోయాయి. చెల్లని ఓట్లు అధికంగా ఉండడం వల్లే మొదటి ప్రాధాన్య ఓట్లతో కోటా ఓటు ఎవరికీ రాలేదని, అనివార్యంగా ద్వితీయ ప్రాధాన్య ఓట్లకు వెళ్లాల్సి వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కాళభైరువుడికి శునకం సాష్టాంగ నమస్కారం

వరంగల్ సిటీ, జూన్ 6: కాశిబుగ్గ కాశీవిశ్వేశ్వరాలయంలో ఆవరణలోని కాళభైరవుడికి ఓ శునకం సాష్టాంగ నమస్కారం చేయడంతో భక్తులు ఆశ్చర్యపోయారు. గురువారం రాత్రి ఆలయంలో అర్చకులు పూజలు నిర్వహిస్తున్న సమయంలో ఓ శునకం వచ్చింది. పూజలు జరుగుతున్నంత సేపూ అలాగే సాష్టాంగ నమస్కారాలు చేసింది. శ్రీకాళభైరవుడి వాహనం కూడా శునకం కావడంతో భక్తులు శునకాన్నికి మొక్కారు. పూజల సందర్భంగా తీసుకువచ్చిన రొట్టెలను శునకానికి తినిపించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ మారింది.



కాళభైరువుడికి సాష్టాంగ నమస్కారం చేస్తున్న శునకం

డీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే డీసెట్-24కు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డీఈవో డి.వాసంతి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. జనరల్, బీసీ విద్యార్థులు ఇంటర్‌లో 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులు 45 శాతం మార్కులు ఉండాలని పేర్కొన్నారు. జూలై 10న నిర్వహించే డీసెట్‌కు ఈ నెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు. http://deecet.cdse.telangana.gov.in వెబ్‌పోర్టల్‌లోనూ దరఖాస్తు కోసం సందర్శించొచ్చన్నారు.



రైలు ప్రమాదంలో రైల్వే ఉద్యోగి మృతి


తరుణ్‌కృష్ణ (ఫైల్)

నెక్కొండ, జూన్ 6 : నెక్కొండ-ఇంటికన్నె రైల్వే స్టేషన్‌ల మధ్య రైలు ప్రమాదానికి గురై విజయవాడకు చెందిన రైల్వే ఉద్యోగి దండబోయిన తరుణ్ కృష్ణ (30) మృతి చెందినట్లు ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎం.ఐలయ్య గురువారం తెలిపారు. జూనియర్ ఇంజనీరింగ్ ట్రాక్ మిషన్ డిపార్టుమెంట్ కాజీపేట సెంక్షన్‌లో విధులను నిర్వహిస్తున్న తరుణ్‌కృష్ణ 407/31-29-ఆఫ్ లైన్ వద్ద గుర్తుతెలియని రైలు బండి నుంచి ప్రమాదవశాత్తు పడడంతో తీవ్ర గాయాలకు గురై మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన సెల్ ఫోన్ ద్వార తరుణ్ కృష్ణ విధులను నిర్వహిస్తున్న శాఖ అధికారులకు, బంధువులకు సమాచారం అందించామన్నారు. పూర్తి వివరాలు తెలయాల్సి ఉందని శవపంచనామ జరిపి శవాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు చెప్పారు.

మహిళా సంఘాల లీడర్ల గంగదేవిపల్లి సందర్శన


సందర్శించిన మహిళ సంఘాల లీడర్‌లు

గీసుగొండ, జూన్ 6: జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని భూపాలపల్లి జిల్లాలోని 10 గ్రామాలకు చెందిన 15 మంది మహిళ సంఘాల లీడర్‌లు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఐక్యత, సాధించిన విజయాలను ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి బృందానికి వివరించారు. గ్రామాభివృద్ధి కమిటీలలో మహిళలు కీలకపాత్ర పోషించటమే కాకుండా ఓ టర్మ్ సర్పంచ్‌తో సహా వార్డు సభ్యులందరిని మహిళలనే ఎన్నుకున్న ఘనత గంగదేవిపల్లికి దక్కిందన్నారు. గ్రామాల అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం అన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఏరియా కమిటీ లీడర్ సుబ్రహ్మణ్యం, కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు పద్మ, వెంకటేశ్వరమ్మ, ఇంజనీర్ ప్రవీణ్ కుమార్, గ్రామ ఆర్పీలు మేడిద సుశీల, గూడ సరోజన పాల్గొన్నారు.

తాటి చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

దుగ్గొండి, జూన్ 6 : మండలంలోని పొనకల్‌లో అక్రమంగా తాటి చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం మోకు దెబ్బ ఆధ్వర్యంలో నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేశ్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గౌడ జనహక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల వృత్తి సంబంధమైన తాటి, ఈత చెట్లను కొంత మంది రోడ్డు వెడల్పు, చెరువు కట్టల మరమ్మతుల పేరుతో నరుకుతున్నారన్నారు. చెట్లను నరకిన వారిపై కేసు నమోదు చేయాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో కందుల శ్రీనివాస్‌గౌడ్, తడుక కొంరెల్లి, మద్దెల సాంబయ్య, బొమ్మగాని సదానందం, పిల్లల సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ చిహ్నం మార్పుపై తహసీల్దార్‌కు వినతి

చెన్నారావుపేట, జూన్ 6 : తెలంగాణ ప్రభుత్వ నమూన చిహ్నం మార్పుపై తాము ప్రతిపాదిస్తున్న చిహ్నంల మార్పు వినతి పత్రాన్ని గురువారం ధర్మ సమాజ్ పార్టీ నాయకులు తహసీల్దార్ ఫణికుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర చిహ్నంలో ఉస్మానియా యూనివర్సిటీ, డాక్టర్ అంబేద్కర్, పండుగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్న, సమ్మక్క-సారక్కల చిత్రాలను చిహ్నంలో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆలువాల శ్రీనువాస్, సంపూల శివకృష్ణ, గొడిశాల స్వామి, పసునూటి సామెలు పాల్గొన్నారు.

పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయాలి

చెన్నారావుపేట, జూన్ 6 : ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు అంగోతు భద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా పదోన్నతులు, ఆరేళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. గత అక్టోబర్‌లో అర్థాంతరంగా నిలిపి వేసిన పదోన్నతులను. బదిలీలను విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే మొదలు పెట్టాలన్నారు. గత అక్టోబర్‌లో బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్‌లందరినీ రిలీవ్ చేసి నూతన పాఠశాలలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యాకయ్య, ఉమాశంకర్, కొంరయ్య, రవి, కట్టస్వామి, వీరన్న, నర్సయ్య, వెంకటేశ్వర్లు, మంజుల, రాణి, కుమారస్వామి పాల్గొన్నారు.

దశాబ్ది డిపాజిట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దుగ్గొండి, జూన్ 6 : దశాబ్ది డిపాజిట్ పథకాన్ని బ్యాంక్ ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కేంద్ర బ్యాంక్ నోడల్ అధికారి స్రవంతి పిలుపు నిచ్చారు. మండలంలోని మహ్మదాపురం, నాచినపల్లి సహకార సంఘాల కార్యాలయాల వద్ద గురువారం దశాబ్ది డిపాజిట్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. బ్యాంక్‌లో డిపాజిట్‌చేసిన డబ్బులకు అధిక వడ్డీఇస్తారన్నారు. అత్యధికంగా రూ.5లక్షల వరకు డిపాజిట్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో రమేశ్, ఖాతాదారులు సంజీవరెడ్డి, గోవర్ధన్, స్వామి, అనిల్, రాజు, సురేందర్, ప్రకాశ్, చింత సాంబయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పనులు పూర్తిచేయాలి

గీసుగొండ, జూన్ 6 : పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు, వసతుల ఏర్పాట్లను వెంటనే పూర్తిచేయాలని మండల ప్రత్యేక అధికారి దేవేందర్ అన్నారు. గీసుగొండ జెడ్పీ పాఠశాలలో గురువారం జరిగిన హెచ్ఎంల సమావేశంలో మాట్లాడారు. వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు పునః ప్రారంభంనాటికి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాంలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణవేణి, సెక్టోరియల్ ఆఫీసర్ సుభాష్, ఎంఎన్‌వో రవిందర్, పట్టాభి, ఏపీఎం సురేష్, సీఆర్పీలు సుధాకర్, రవి, వెంకటరమణ, ఎంఐఎస్ సారిక, డీవో రాజగోపాల్, శంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


దమ్మన్నపేటలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి

వర్ధన్నపేట రూరల్, జూన్ 6 : ప్రభుత్వ బడిని కాపాడుకుని విద్యార్థుల భవిష్యత్తుకు మార్గ నిర్దేశకులుగా నిలవాలని వర్ధన్నపేట వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని దమ్మన్నపేటలో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకే పంపించాలని, ప్రభుత్వ బడిలోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. కార్పొరేట్ మోజులో పడి తల్లిదండ్రులు జేబులు గుల్ల చేసుకోవద్దన్నారు. ఉన్నత స్థాయిలకు ఎదిగిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బడి నుంచే వెళ్లారనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మహేష్ నాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ హైమా, సీపీ మండల పద్మ, ఉపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, కవిత, సరళ, సరస్వతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● నెక్కొండ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన లో ముందుడటమే కాకుండా ప్రతిభ, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులచే విద్యాబోధనలు అందిస్తుందని నెక్కొండ, సూరుపల్లి హైస్కూల్ హెడ్మాస్టర్‌లు రంగారావు, పరమేశ్వర్, సూరుపల్లి, వెంకటాపురం ప్రాథమిక పాఠశాలల హెడ్మాస్టర్‌లు భోజ్యానాయక్, బానోతు భిక్షపతి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహ కల్పిస్తూ గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, పాఠ్య, రాత పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. విశాలమైన తరగతి గదులతో పాటు విద్యార్థులు శారీరకంగా ఎదుగుదలకు విశాలమైన క్రీడాస్థలాలు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకొని పాఠశాలలో చేర్పించనున్న విద్యార్థుల పేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రాధిక, రజియా, శశిరేఖ, ఉపాధ్యాయులు రగురామయ్య, లక్ష్మణ్, రమాదేవి, పూర్ణిమ్మ, సుధాకర్, ఎగ్బాల్‌ఖాన్ , నూరజ్‌నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమంలో వక్తలు

● పర్వతగిరి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా సహకార అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన బడిబాటలో ఆయన పాల్గొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పాఠశాలల అభివృద్ధి పనులను పరిశీలించి, విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూని ఫాంలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, నోడల్ ఆఫీసర్ గాయపు లింగారెడ్డి, ఎంపీవో పాక శ్రీనివాస్, ఏపీఎం కృష్ణమూర్తి, పర్వతగిరి, కొంకపాక కాంప్లెక్స్ హెచ్ఎంలు పాక రమేష్, భిక్షపతి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

● గీసుగొండ : ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలకే పిల్లలను పంపించాలని కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. బడిబాటలో భాగంగా గురువారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో సమావేశాలు నిర్వహించిన అనంతరం విద్యార్థుల ఇంటికి వెళ్లి ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్‌లు, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్య గురించి వివరించారు. బాసర ట్రిపుల్ ఐఐటీ లాంటి విద్యా సంస్థల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకే సీట్లు ఇస్తున్నట్లు చెప్పారు. గీసుగొండ, వంచనగిరి, మచ్చాపూర్, కొమ్మాల, ఎలుకుర్తి, గొర్రెకుంట, ధర్మారం, శాయంపేట, మొగిలిచర్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రచారంలో పాల్గొన్నారు.


నెక్కొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, వద్యార్థులు

● దుగ్గొండి : మండలంలో వివిధ గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ప్రారంభించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని వీధుల్లో ర్యాలీచేశారు. మండల కేంద్రంలో హెచ్ఎం రామ స్వామి ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు హమ్మద్, మహేశ్, వీరభద్రయ్య, సంధ్యారాణి, కురుణ, రజనీ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి : మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలు కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా గ్రామంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు కృషి చేయాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే పాఠశాలలు మెరుగ్గా పనిచేస్తాయన్నారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

పార్టీ బలోపేతంపై దృష్టి సారిస్తాం

బీజేపీ నేత, మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్

నర్సంపేట, జూన్ 6 : గత అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ అన్నారు. పట్టణంలోని గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి ఇంటి ఆవరణలో గురువారం మీడి యా సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీకి బలంలేదని ఆ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం అసాధ్యమని బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేశారన్నారు. బీజేపీని విమర్శించే నైతిక హక్కు ఆ పార్టీలకు లేదన్నారు. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాల్లో 8 స్థానాల్లో కాం గ్రెస్ గెలుపొందగా బీజేపీ 8 స్థానాల్లో విజయం సాధించి సత్తాను చాటుకుందన్నారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చాక తనకు కేసీఆర్ అన్యాయం చేసి పార్టీ నుంచి వెళ్ళిపోయేలా చేశారని ఆయన అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క రూపాయి పంచకున్నప్పటికీ ప్రజలు తనను ఆదరించి లక్ష 10వేల 404ఓట్లు వేశారన్నారు. వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాతీర్పును గౌరవిస్తానన్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో తాను గెలిచిన సమయంలో నర్సంపేట నియోజకవర్గం ప్రజలు మెజార్టీ ఓట్లు వేశారన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తాను ఓటమి పాలైనప్పటికీ నర్సంపేట నియోజకవర్గంలో 24,220 ఓట్లు వచ్చాయన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి నర్సంపేటలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం నర్సంపేట నియోజకవర్గంలోని 283 బూత్‌ల పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో పార్టీని కొంత మేరకు బలోపేతం చేశామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, మునిసిపల్ ఎన్నికల్లో పార్టీ అభ ్యర్థులు విజయం సాధించేలా ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతామన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీలో బలమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేసి కాషాయం జెండా ఎగురవేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలను కార్యోన్ముకులను చేయడంతో పాటు పార్టీ బలోపేతంపై దృష్టిసారిస్తామన్నారు. బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్లమెంట్ ఎన్నికల వరకు పార్టీ బలోపేతమైందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడనుందని, కేంద్ర నిధులను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సహకారంతో మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర నాయకుల సహకారంతో నిధులను మంజూరీ చేయించుకొని నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, రాంచంద్రా రెడ్డి, కౌన్సిలర్ జుర్రు రాజుయాదవ్‌తో పాటు ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఈటలను కలిసిన బీజేపీ నేతలు


ఈటలను సత్కరిస్తున్న బీజేపీ నేతలు

సంగెం, జూన్ 6 : మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలుపొందిన ఈటల రాజేందర్‌ను బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్ లోని ఈటల ఇంట్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబరు గట్టికొప్పుల రాంబాబు, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు కాగితాల సాయికుమార్, బదావత్ రాజన్, నన్నెబోయిన శ్రీనివాస్, నాతి అనిల్‌తోపాటు పార్టీకి చెందిన నాయకులు ఈటలను సత్కరించారు.

గీసుగొండ పీహెచ్‌సీ తనిఖీ

గీసుగొండ, జూన్ 6 : గీసుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కాజిపేట వెంకట రమణ గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆస్పత్రిలో అమలవుతున్న జాతీయ కార్యక్రమాలు, టార్గెట్‌ల పూర్తిపై ఆరాతీశారు. రాబోయే సీజనల్ వ్యాధులతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమయపాలన విధిగా పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్చన, సీహెచ్‌వో మధుసూదన్‌రెడ్డి, సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తొలి ప్రాధాన్యంలో తేలని ఫలితం

(5వ పేజీ తరువాయి)

48 మంది అభ్యర్థుల ఓట్లు కలిపినా కోటా ఓటు వచ్చే అవకాశం ఉండదు. అయితే ఈ 48 మంది అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియ శుక్రవారం ఉదయం వరకు కొనసాగే పరిస్థితి ఉంది. ఇదే సమయంలో మూడో రౌండ్ ఓట్ల కౌంటింగ్‌పై తమకు అనుమానాలున్నాయని, మళ్లీ లెక్కించాలని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి డిమాండ్ చేయడంతో వాతావరణం వేడెక్కింది. ఎన్నికల సంఘం ఆయన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటుందా? లేదా? అనే అంశం తేలాల్సి ఉంది.

విజేతను తేల్చేది ఆ ఇద్దరి ద్వితీయ ప్రాధాన్య ఓట్లే

స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన నల్లగొండకు చెందిన పాలకూరి అశోక్‌కుమార్, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేట్ అయ్యాక, వారి బ్యాలెట్లలోని ద్వితీయ ప్రాధాన్య ఓట్లే విజేతను తేల్చే అవకాశముందని భావిస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన అశోక్ కుమార్, 48 మంది స్వతంత్ర అభ్యర్థుల తర్వాత ఎలిమినేట్ అవుతారు. ఆయన ఓట్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎవరికి ఏ స్థాయిలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లు వస్తాయనే అంశం కీలకం కానుంది. అయితే కౌంటింగ్ సరళిని పరిశీలిస్తున్న రాజకీయనేతలు, పరిశీలకులు అశోక్‌కుమార్‌కు చెందిన బ్యాలెట్ల ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో కోటా ఓటు ఎవరికీ రాదని, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ తప్పదని భావిస్తున్నారు. ఆయన బ్యాలెట్ల ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక కోటా ఓటు రావచ్చని అంచనా వేస్తున్నారు. అయితే అప్పటికీ కోటా ఓటు రాకపోతే రెండో స్థానంలో ఉండే అభ్యర్థికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్య ఓట్లనూ లెక్కిస్తారు. అప్పటికీ కోటా ఓటు రాకపోతే అనూహ్యంగా తృతీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించాల్సి ఉంటుంది. గరిష్టంగా ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో ఫలితం తేలుతుందని అంచనా వేస్తున్నారు.

చెమటలు పట్టించిన చెల్లని ఓట్లు


మొదటి ప్రాధాన్య ఓట్లలో చెల్లని ఓట్లు అత్యధికంగా నమోదవడం ప్రధాన పార్టీల అభ్యర్థులను చెమటలు పట్టిస్తున్నాయి. గతంలో ఎన్నడూలేని రీతిలో పోలైన ఓట్లలో దాదాపు 8.50శాతం ఓట్లు చెల్లకుండా పోయాయి. మూడో రౌండ్ వరకే 23,784 ఓట్లు చెల్లకుండా పోగా, ప్రధాన అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగో రౌండ్ ముగిసే సరికి 25,824ఓట్లు చెల్లకుండా పోయాయి. ఎంతో అవగాహన ఉన్న గ్రాడ్యుయేట్ల ఓట్లే ఈ స్థాయిలో చెల్లకుండా పోవడమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాలెట్ పేపర్లపై అడ్డగోలు రాతలు, నినాదాలు, సంతకాలు, ఫోన్ నెంబర్లు, ప్రాధాన్య ఓటు ఇవ్వడంలో నిర్లక్ష్య వైఖరి వంటి కారణాలతో ఓట్లు చెల్లకుండా పోయాయి. చెల్లని ఓట్లు అధికంగా ఉండడం వల్లే మొదటి ప్రాధాన్య ఓట్లతో కోటా ఓటు ఎవరికీ రాలేదని, అనివార్యంగా ద్వితీయ ప్రాధాన్య ఓట్లకు వెళ్లాల్సి వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి


బాజీ (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, జూన్ 6 : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయ త్నానికి పాల్పడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలం లోని రాంధాన్ తండా శివారు మూడుగుండ్ల తండాలో గురువారం చోటుచేసుకుంది. వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం... ఈనెల 4న బానోతు బాజీ ఇంటి పక్కవారితో ఉన్న గొడవ కారణం గా మనస్థాపానికి గురై పురుగుల మందు(గడ్డిమందు) సేవించగా, గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 5న అర్థరాత్రి బాజీ మృతిచెందడంతో మృతురాలి కుమారుడు మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదుచేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహన్ని అప్పగించారు. తన తల్లి మృతిపట్ల ఎలాంటి అనుమానాలులేవని పోలీసులకు స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు..


రవి (ఫైల్)

సంగెం, జూన్ 6 : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతూ యువకుడు మృతి చెందగా, మరొకరు చికిత్స పొందుతున్నారు. సంగెం ఎస్సై నరేష్ కథనం ప్రకారం... మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం రౌతుగూడెంకు చెందిన మాలోతు రవి (34) తన భార్య సరిత, తల్లి సోనాలతో కలిసి సంగెం మండలం తిమ్మాపురం ఓ కార్యక్రమానికి బుధవారం ఉదయం వెళ్లారు. సాయంత్రం బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. మండల కేంద్రానికి వచ్చేసరికి ఓ బాలుడు ద్విచక్రవాహనం నడుపుతూ వచ్చి ఢీకొట్టాడు. దీంతో రవి, సరిత, సోనా గాయపడ్డారు. స్థానికులు సాయంతో క్షతగాత్రులను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి రవి మృతి చెందగా, తల్లి సోనా చికిత్స పొందుతోంది. గురువారం మృతుడి భార్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు.. తప్పిన ప్రమాదం

నెక్కొండ, జూన్ 6: మండ పనికరలో ఎస్సీకాలనీలోని ఇడ్ల పైనుంచి వెళ్లిన విద్యుత్ వైర్లు గురువారం ప్రమాదవశాత్తు మాజీ సర్పంచ్ బిర్రు ఎల్లయ్య ఇంటి అవరణలో తెగిపడడంతో ఆయన కుటుంబ సభ్యులకు ప్రమాదం తప్పింది. ఎల్లయ్య కుటుంబ సభ్యులు నీలమ్మ, పూలమ్మ, సాగర్ ఇంటి ముందు కుర్చున సమయంలో అటుగా వెలుతున్న గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్న ఆటోకు విద్యుత్ సర్వీస్ వైర్లు తగలడంతో మెయిన్ వైరుతెగి పడింది. దీంతో ఎల్లయ్య కుటుంబ సభ్యులు స్వల్ప విద్యుత్ షాక్‌కు గురయ్యారు. విద్యుత్ సిబ్బంది ఖజాపాషా తదితరులు వెంటనే మరమ్మతు చేశారు.

పోక్సో కేసు నమోదు

సంగెం, జూన్ 6 : సంగెం మండలం సోమ్లతండాకు చెందిన యువకుడి(23)పై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పర్వతగిరి సీఐ శ్రీనివాస్, సంగెం ఎస్సై నరేష్‌లు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఇదే మండలానికి చెందిన యువతితో ప్రేమిస్తున్నానంటూ నమ్మించి ఆమెతో అసభ్యకరంగా ఫొటోలు దిగి, యువతి తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో శారీరకంగా కలిశాడని పేర్కొన్నారు. అలాగే, యువతి తన సోదరి ఇంటికి వచ్చిన సందర్భంగా శారీరకంగా కలవాలని బలవంతం చేయగా, అందుకు నిరాకరించి వివాహం చేసుకోవాలని కోరిందన్నారు. యువకుడు తన వద్ద ఉన్న ఫొటోలు వైరల్ చేస్తానని బెదిరించాడన్నారు. దీంతో యువతి ఫిర్యాదు చేయడంతో గురువారం యువకుడిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చడం జరిగిందన్నారు.

డీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6 : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొ మా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే డీసెట్-24 కు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డీఈవో డి.వాసంతి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. జనరల్, బీసీ విద్యార్థులు ఇంటర్‌లో 50శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులు 45శాతం మార్కులు ఉండాలని పేర్కొన్నారు. జూలై 10న నిర్వహించే డీసెట్‌కు ఈ నెల 30వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నా రు. దరఖాస్తు కోసం జ్టిఞ//ౕఛ్టిఛ్ఛి.ఛిఝ్టటజ్చూ జ్ఛు.జౌఠి.జీుఽ వెబ్‌పోర్టల్‌ను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

● ఆర్‌పీఐ బొజ్జతారకం రాష్ట్ర కో ఆర్డినేటర్ సాంబయ్య

నర్సంపేట, జూన్ 6 : భూమిని పంచు, బడ్జెట్ పెంచు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో ఈ నెల 16న నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ బొజ్జతారకం పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ జన్ను సాంబయ్య, జిల్లా కో- ఆర్డినేటర్ అంకేశ్వరపు రమేశ్ పిలుపు నిచ్చారు. పట్టణంలో రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ముద్రించిన కరప త్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ బొజ్జతారకం ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో పేదలకు భూ పంపిణీ ప్రధాన ఎజెండాగా పని చే యాలని పార్టీ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో శ్రీరాములు, పైడి, పీసరి రజిత. హసినాబేగం, గునిగంటి రమేశ్, కనుకుల శారద, శంకర్ పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలి

పర్వతగిరి, జూన్ 6 : వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలని ఎంపీడీ వో శంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలువురు వ్యా పారులకు ట్రేడ్‌లైసెన్సులను మంజూరు చేశారు. వ్యాపారులు ట్రేడ్ లైసెన్సు కలిగి ఉంటేనే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. లైసెన్సులను ప్రతీ ఏటా రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో పాక శ్రీనివాసులు, కార్యదర్శి రఘు, కారోబార్ కరుణాకర్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

వర్ధన్నపేట రూరల్, జూన్ 6: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ముందుకు రావాలని ఇల్లంద గ్రామ సెక్రటరీ రామారావు సూచించారు. గురువారం మండలంలోని ఇల్లందలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో సిబ్బంది సహకారంతో చెత్తను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్‌ను వాడడం తగ్గించాలని, చుట్టూ ప్రక్కల తమ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డ చెట్ల తొలగింపు

దుగ్గొండి, జూన్ 6 : మండలంలోని తిమ్మంపేట, నారా యణతండాల మధ్యగల రోడ్డుపై గురువారం సాయంత్రం వచ్చిన గాలి దుమారంతో చెట్లు విరిగిపడగా స్పందించిన పోలీసులు చెట్లు తొలగించారు.స్థానికుల కథనం ప్రకారం... గాలి దుమారం, వర్షం కురవడంతో రోడ్డు పక్కన ఉన్న చెట్లు విరిగి పడ్డాయి. విషయం తెలుసుకున్న ఎస్సై జక్కుల పరమేశ్ పోలీసులచే చెట్లు తొలగించారు. చెట్ల తొలగింపులో హెచ్‌జీలు రవి, అశోక్, పూర్ణలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చెన్నారావుపేట, జూన్ 6 : మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 7న నిర్వహించనున్న మండల సర్వ సభ్య సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో గోవిందరావు గురువారం తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.